## క్లుప్తంగా

### శాంతిభద్రతలను పరిరక్షించండి



ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కలిసిన పెద్దతుంబళం ఎస్‌ఐ పీరయ్య

ఆదోనిటౌన్ : గ్రామాల్లో శాంతిభద్రతలను పరిరక్షించాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సూచించారు. మట్కా, సారా, పేకాట, కర్ణాటక మద్యం అమ్మకందారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం పెద్దతుంబళం ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐ పీరయ్య ఎమ్మెల్యేను ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల గురించి చర్చించారు.

### శాంతి భద్రత విషయంలో రాజీ పడ్డొద్దు



ఎమ్మెల్యేకు బోకే అందజేస్తున్న ఎస్‌ఐ

పెద్దకడబూరు: మండలంలో శాంతి భద్రతల విషయంలో రాజీ పడొద్దని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఎస్‌ఐ మహేష్‌కుమార్‌ను ఆదేశించారు. బుధవారం ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌కుమార్ మంత్రాలయం మండలంలోని రాంపురం గ్రామంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మండలంలోని పరిస్థితులను గురించి చర్చించారు. మండలంలో అసాంఘిక కార్యాలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ చెప్పారు. మంగళవారం ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు బదిలీపై ఇస్వీ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న మహేష్‌కుమార్‌ను నియమించారు.

### నేడు అదనపు గదులు ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన అదనపు తరగతి గదులు

కౌతాళం: స్థానిక జెడ్పీ పాఠశాలలో ఆదనపు గదులు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. మన బడి నాడు–నేడు కింద జెడ్పీ ఉన్నత పాఠశాలకు 10 అదనపు గదుల నిర్మాణానికి రూ. 2.14కోట్లు మంజూరు కాగా.. పనులు పూర్తయ్యాయి. దీంతో గురువారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి వాటిని ప్రారంభిస్తారని పీఎంసీ చైర్మన్ వడ్డె రాము, హెచ్ఎం ఇమ్మానుయేల్ బుధవారం తెలిపారు. గదులు ప్రారంభమైతే విద్యార్థులకు గదుల కొరత తీరుతుందని ప్రధానోపాధ్యాయుడు చెప్పారు.

### క్రీడాకారిణికి అభినందన



సంజనను అభినందిస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్ : పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో నివాసముంటున్న పంపాపతి, పావని దంపతుల కుమార్తె, క్రికెట్ క్రీడాకారిణి బందికె సంజనను బుధవారం భీమాస్ ఫంక్షన్‌హాల్‌లో ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త విట్టా రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. గత నెలలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని సంజన ప్రతిభ చాటింది. దీంతో జిల్లా స్థాయి టీంకు ఎంపిక చేశారు. ఈనెల 21, 22, 23వ తేదీల్లో తిరుపతి జిల్లా వెంకటగిరిలో మూడు రోజులపాటు జరిగే అండర్–19 పోటీలకు సంజన, వన్షక పాల్గొంటారని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దేవేంద్రగౌడ తెలిపారు. సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు ముజీబ్‌అహ్మద్, కోచ్‌లు వెంకటేష్, బాలాజీ పాల్గొన్నారు.

### డివైడర్‌ను ఢీకొట్టిన తుఫాన్




ప్రమాద తీరును పరిశీలిస్తున్న పోలీసులు

మంత్రాలయం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎమ్మిగనూరు వైపు నుంచి మంత్రాలయం వస్తున్న తుఫాన్ వాహనం డివైడర్‌ను ఢీకొట్టింది. మంత్రాలయం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం లింగదహళ్లి గ్రామానికి చెందిన రమేష్ ఈరప్ప తనతో పాటు మరి కొందరితో కలిసి శ్రీశైలం, మహానంది దర్శనాలు ముగించుకుని మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వస్తుండగా మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు జేసీబీ సహాయంతో వాహనాన్ని పక్కకు తీయించారు. కాగా వాహనంలో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయట పడటంతో వారు సొంతూళ్లకు వెళ్లిపోయారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# ఆధ్యాత్మికం.. ఆహ్లాదం

- 600 అడుగుల ఎత్తులో రణమండల గిరి
- పురాణాల్లో బృశ్చిక పర్వతంగా ఖ్యాతి
- మొదటగా పూజలు చేసిన వ్యాస మహర్షి
- భక్తుల దేవుడిగా పూజలందుకుంటున్న ఆంజనేయస్వామి
- శ్రావణ మాసంలో నెల పాటు భక్తుల విశేష పూజలు



కొండల మధ్యలో సీసీ రోడ్డు ,(ఇన్‌సెట్) శ్రీ రణమండల ఆంజనేయస్వామి నిజరూపం



హనుమ రూపంలో కొండరాయి



కొండపై నాటి రాజుల మండపం

ఆదోని అర్బన్ : పట్టణానికి మూడు కి.మీ. దూరంలో రణమండల గిరిపై వెలసిన రణమండల క్షేత్రం ప్రకృతి ఒడిలో వెలసింది. రణమండల గిరిని బృశ్చిక పర్వతం అంటారని పురాణాలు పేర్కొంటున్నాయి. కొండపై పురాతమైన చెట్లు, రాజుల కాలం నాటి కోటలు, మండపాలు, గుహలు, ఆహ్లాదకరమైన వాతావరణం ఈ క్షేత్రం సొంతం. కొండల మధ్య దారి, దారి పొడవునా పెద్ద పెద్ద చెట్లు.. ఇలా ఈ ప్రాంతానికి వెళ్లడం నూతన అనుభూతినిస్తుంది. కొండల్లో అక్కడక్కడా రాళ్లపై తీర్చిదిద్దిన శ్రీరాముడి నామాలు, ఆంజనేయుడి ముఖం ఎంతగానో ఆకట్టుకుంటాయి. క్షేత్రంలో వెలసిన ఆంజనేయస్వామికి నిత్య పూజలతో పాటు ప్రతి మంగళవారం, శనివారం, అమావాస్య రోజుల్లో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇక శ్రావణ మాసంలో నెల రోజుల పాటు భక్తులతో క్షేత్రం కిటకిటలాడుతుంది.

**బృశ్చిక పర్వతం అంటే..**


త్రేతాయుగంలో అన్నదమ్ములైన వాలీ, సుగ్రీవుడు మధ్య యుద్ధం జరిగింది తెలిసిందే. తన తలపడిన ప్రత్యర్థి బలమంతా వాలీకి చేరుతుంది. దీంతో ప్రత్యర్థులకు ఓటమి మిగిలేది. ఒకసారి వాలీ, సుగ్రీవులకు యుద్ధం జరుగుతుంది. ఈ యుద్ధంలో సుగ్రీవుడు ఓడిపోయి బృశ్చముఖ పర్వతంలో తల దాచుకుంటాడు. అయితే బృశ్చముక పర్వతానికి వెళ్తే తల పగిలి చనిపోతావని వాలిని ఓ మునీశ్వరుడు శపించి ఉంటాడు. ఇది తెలుసుకొని సుగ్రీవుడు వాలీ రాలేడని ఈ కొండపై తలదాచుకుంటాడు. సుగ్రీవుడి మంత్రి అయిన ఆంజనేయస్వామి కూడా ఆయనతోనే ఉంటారు. బృశ్చముఖ పర్వతంపై ఆంజనేయస్వామి కొలువై ఉన్నాడని తన దివ్యదృష్టితో గ్రహించిన వ్యాస మహర్షి మొదటగా అక్కడికి చేరుకొని పూజలు చేశారని చరిత్ర చెబుతోందని ఆలయ పూజారి ఆనంద ఆచారి తెలిపారు.



రణమండలకు వెళ్లేందుకు కొండపై మెట్ల దారి



రణమండల ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణం



మునీశ్వరస్వామి గుహ

### మొహర్రం ప్రశాంతంగా జరుపుకోండి



కామన్‌దొడ్డిలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సీతారామయ్య

కోసిగి: మొహర్రం పూజలను భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని కామన్‌దొడ్డి గ్రామంలో సీఐ ఎరిసావలి, ఎస్‌ఐ సతీష్ కుమార్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇరువర్గాలతో సమావేశం నిర్వహించి కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ చిన్న చిన్న తగాదాలతో క్షణికావేశానికి లోనై జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పల్లెపాడు గ్రామంలోని ఇరువర్గాల నాయకులకు ఎస్‌ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు . ఆయన మాట్లాడుతూ పల్లెపాడులో గతేడాది మొహర్రం సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణలు జరిగాయని, ఈ ఏడాది అలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆదేశించారు. వేడుకల్లో అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

### వసతి గృహానికి భవనం నిర్మించాలి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని బీసీ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి పక్కా భవనం నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ పాఠశాలల పేరెంట్స్ అసోషియేషన్ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసులు బుధవారం కోరారు.

## పర్యావరణాన్ని రక్షిద్దాం

ఆదోనిటౌన్ : మున్సిపాలిటీలో ప్రతి ఇంటి ఆవరణలో, పరిసరాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపాలిటీ నిధులతో కొత్తగా కొనుగోలు చేసిన ఆగర్ మిషన్‌ను పరిశీలించి ట్రయల్ రన్ చేశారు. ఈ మిషన్ ద్వారా మొక్కలను నాటేందుకు అవసరమైన గుంతలను మొక్కలకు అనుగుణంగా తవ్వేందుకు వీలుంటుందన్నారు.

కౌతాళం: ప్రతి ఇంటికో మొక్క నాటి పర్యావరణాన్ని సంరక్షించుకుందామని ఎంపీపీ అమరేష్ సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద మంజూరైన మునగ మొక్కల్ని బుధవారం వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కోఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ బనవాసి నర్సరీ నుంచి వచ్చిన 898 మొక్కలను మండలంలోని గుడికంబాలి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు అందజేశారు. అలాగే హాల్వి గ్రామ రైతులు 13మందికి 9,900 మొక్కలను పంపిణీ చేశారు. ఎకరాకు 498 మొక్కల చొప్పన రైతులకు పంపిణీ చేశామని ఏపీఓ జుబేర్ తెలిపారు. ఎంపీడీఓ సుబ్బారాజు, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

**వన సంరక్షణతో జంతువుల పరిరక్షణ..**

ఆదోని సెంట్రల్: ఆదోని డివిజన్ పరిధిలో వన సంరక్షణతో పాటు జింకల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు ఫారెస్టు రేంజ్ అధికారి తేజశ్విని తెలిపారు. బుదువారం అటవీ శాఖ కార్యలయంలో ఆమె మాట్లాడుతూ ఇటీవల జింకలు ప్రమాదాలకు గురై చనిపోయాయని, ప్రమాదాల నుంచి వాటిని కాపాడే చర్యలో భాగంగా జింకలు ఎక్కువగా తిరిగే రహదారుల్లో స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఫారెస్టు రేంజ్ పరిధిలో జింకల కోసం 20 హెక్టార్లలో ఫోడర్ ప్లాట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జింకల తినగలిగే విత్తనాలను చల్లి వాటి ద్వారా వాటికి ఆహారం అందేలా చూస్తామని పేర్కొన్నారు. ఎమ్మిగనూర్ మండలం కోటికల్లు దగ్గర వద్ద రూ.2 కోట్లతో నగరవనం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాలు కురుస్తున్నందున డివిజన్‌లో 2,500 మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

## పోలింగ్ బూత్‌ల తనిఖీ



కోసిగిలో పోలింగ్ బూత్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ రమా

కోసిగి: స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ బూత్‌లను మంత్రాలయం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ రమా బుధవారం తనిఖీ చేశారు. పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు అనుకూలంగా గదులు, మౌలిక వసుతులు, దివ్యాంగులకు రాంప్ తదితర వసతులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బూత్ లెవెల్ ఆఫీసర్స్ ఇంటింటికీ తిరిగి ఓటర్ల జాబితాను పరిశీలిస్తారని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఫామ్–6 లో పేర్లు నమోదు చేయించాలన్నారు. అలాగే మరణించిన వారు పేర్లు, ఇతర పట్టణాల్లో స్థిర పడిన వారి పేర్లును ఫామ్–7లో ఎంట్రీ చేసి తొలగించాలని ఆదేశించారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ఖలీల అహ్మద్, సర్వేయర్ బసవరాజు, వీఆర్వోలు మయూరి, లింగన్న పాల్గొన్నారు.

## యాసిడ్ విక్రయాలపై అవగాహన

ఆదోనిఅర్బన్ : పట్టణంలో రసాయనాల (యాసిడ్స్)ను దుర్వినియోగం చేయరాదని విక్రయదారులకు డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. బుధవారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బులియన్ మార్కెట్ అసోసియేషన్, గోల్డ్ స్మిత్ అసోసియేషన్, గోల్డ్ కరిగించే అసోసియేషన్ మెంబర్లు, స్వర్ణకారులు, బంగారం కరిగించే వారికి రసాయనాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ అధిక మొత్తంలో రసాయనాలను భద్రపరచడం వల్లకలిగే అనర్థాలను, రసాయనాలను దుర్వినియోగం చేయరాదని వివరించారు. క్రయ విక్రయాలు లేకుండా రసాయనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. టూటౌన్ సీఐ శ్రీనివాస నాయక్, ట్రాఫిక్ సీఐ పార్థసారధి పాల్గొన్నారు.

**మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి..**

మొహర్రం పూజలను ముస్లిం మతపెద్దలు, గ్రామ చావిడిల నిర్వాహకులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మతపెద్దలు, పీర్లచావిడిల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పీర్ల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని చెప్పారు.




మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి


### నేటి నుంచి డిగ్రీ వెబ్ ఆప్షన్స్

ఆదోని సెంట్రల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు దరఖాస్తు విద్యార్థులకు ఈనెల 20వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో చేరే విద్యార్థులకు అనుగుణంగా అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం కళాశాలలో బీఏ ఎకానామిక్స్‌లో 60 సీట్లు, బీకాం కామర్స్‌లో 60 సీట్లు, బీఎస్సీ (బీజెడ్‌సీ)లో 60 సీట్లు ఉన్నాయని చెప్పారు. ఆప్షన్ తరువాత సీట్లు అలాట్‌మెంట్ జరుగుతుందన్నారు.

## ప్రజా సంక్షేమమే సురక్ష ధ్యేయం



ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ ఈరన్న



పత్రాలను అందజేస్తున్న ఎంపీపీ

కోసిగి: ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం అమలు చేస్తుందని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఆర్లబండ గ్రామంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, పల్లెపాడు గ్రామంలో తహసీల్దార్ రుద్రగౌడ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆర్లబండలో నాడుగేని నాగరాజు, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు బుళ్లి నరసింహులుతో కలిసి ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి పరుశురాముడు, ఎంపీటీసీ గొళ్ల తాయమ్మ పాల్గొన్నారు.

కౌతాళం: ప్రతి సమస్యకు జగనన్న సురక్ష కార్యక్రమంతో సాధ్యమవుతుందని ఎంపీపీ అమరేష్ అన్నారు. బుధవారం మండలంలోని బదినేహాల్ గ్రామంలో తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి టీం, సుళేకేరిలో ఎంపీడీఓ సుబ్బారాజు టీం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి ధ్రువ పత్రాలు అందజేశారు.మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, కో ఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, వీరభద్రగౌడ్, ఉప సర్పంచ్ ప్రసన్నగౌడ్, ఏఓ శేషాద్రి, వెంకటరామిరెడ్డి, ఆర్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

## మాయమాటలు చెప్పి మోసం చేయడం బాబు నైజం



ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: మాయ మాటలు చెప్పి ప్రజలను మోసం చేయడం బాబు నైజమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని ఖగ్గల్, కాచాపురం గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఎమ్మెల్యే సొంత గ్రామాలైన రాంపురం, కాచాపురం, దిబ్బనదొడ్డి, 52బసాపురం ,నారాయణపురం, ఖగ్గల్ గ్రామాలకు ఎలాంటి నిధులు, సంక్షేమ పథకాలు ఇవ్వకుండా అడ్డుపడింది ఆయనేనని మండిపడ్డారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా నాడు నా గ్రామాలను అభివృద్ధి చేయలేకపోయానన్నారు. ఇప్పుడు మనందరి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నాడు–నేడు పథకంతో పాఠశాల రూపురేఖలు మార్చడమే కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తుఆమని చెప్పారు. ఇటీవల 1,780 మంది రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద దాదాపు రూ.కోటి విడుదలైందన్నారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే మరోసారి సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ని ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువ పత్రాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి, బాబిరెడ్డి, కృష్ణారెడ్డి, పెట్రోల్‌బంక్ శీనన్న, వీకేసీ రఘు, ఎంపీడీఓ మణిమంజరి, ఈఓపీఆర్డీ ప్రభావతి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఏవో జీరాగణేష్, ఏఈఓ నరసింహ ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కౌతాళం: మండలంలోని మేళిగనూరు గ్రామం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నదిచాగి గ్రామానికి చెందిన నాగన్నగౌడ్ (45) మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మేళిగనూరు గ్రామం తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామికి సేవ చేస్తుండే నాగన్నగౌడ్ రోజు వారి మాదిరిగానే రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి రాత్రి గ్రామానికి బైక్‌పై వస్తుండగా కర్ణాటకలోని చెల్లెకుడ్లూరు గ్రామానికి చెందిన వారు నదిచాగి నుంచి బైక్‌పై వెళ్తున్నారు మేళిగనూరు సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొనడంతో నాగన్నగౌడ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు గమనించి ఆసుపత్రికి తరలించేలోపు మృతి చెందాడు. మృతుడికి భార్య చంద్రకళ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### గుండెపోటుతో వంట మాస్టర్ మృతి

ఆదోని సెంట్రల్: పట్టణంలోని మంత్రాలయం-ఆదోని బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో వంట మాస్టర్ యం.సుంకన్న గుండె పోటుతో మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం వంట చేస్తున్న సమయంలో తనకు తలతిరుగుతోందని కుప్పకూలిపోయాడు. తోటి సిబ్బంది హుటాహుటిన పట్టణంలోని ప్రభుత్వ ఏరియా అసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి బీపీ ఎక్కువగా ఉందని సీటీ స్కాన్ చేయాలని తెలిపారు. సీటీ స్కాన్ చేయించడానికి ఏర్పాట్లు చేస్తుండగానే మృతి చెందినట్లు వసతి గృహ సంరక్షకుడు హనుమిరెడ్డి తెలిపారు. మృతుడు మిడుతూరు మండలం తలముడిపి గ్రామానికి చెందిన వాడని చెప్పారు.

### కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం: మండల కేంద్రంలోని రామచంద్ర నగర్‌కు చెందిన ఈడిగ జయరాముడు అనే వ్యక్తి 36 కర్ణాటక మద్యం ప్యాకెట్లను తరలిస్తుండగా ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు అదుపులోకి తీసుకున్నారు. మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

### మహిళకు సపర్యలు

మంత్రాలయం: పది రోజుల క్రితం మతిస్థిమితం లేని 30 సంవత్సరాల వయస్సు గల మహిళ శ్రీ రాఘవేంద్రస్వామి మఠం వద్ద మూర్ఛ వ్యాధితో పడిపోయింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వెంటనే ఆమెను అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు తరలించారు. దాదాపు 9 రోజుల పాటు ఆమెకు వైద్య సేవలు అందించి ఆదోనిలోని జీవన జ్యోతి ఆశ్రమంలో చేర్పించి కానిస్టేబుల్ రంగస్వామి తన ఔదర్యాని చాటుకున్నారు.



మహిళను ఆశ్రమంలో వదులుతున్న కానిస్టేబుల్

### పాఠ్యపుస్తకాలు మంజూరు

కౌతాళం: మండలానికి సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాలు మంజూరయ్యాయని, వాటని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు పంపిణీ చేసినట్లు ఎంఈఓ శోభరాణి తెలిపారు. బుధవారం ఆయా పాఠశాలలకు ఇండెంట్‌ల ప్రకారం పుస్తకాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మండలానికి 1,25,706 పుస్తకాలు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,12,142 పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు.

కోసిగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సెమిస్టర్–2 పాఠ్య పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ–2 నాగేశప్ప తెలిపారు. బుధవారం కోసిగికు చేరిన పాఠ్య పుస్తకాలను పాఠశాలల వారిగా పంపిణీ చేపట్టారు. సీఆర్‌పీలు యోహాన్, ఉశేని, అనంతరాం, ఎంఐఎస్ వీరారెడ్డి, డీటీపీ నరేంద్ర పాల్గొన్నారు.



సెమిస్టర్–2 పాఠ్యపుస్తకాలను చూపుతున్న ఎంఈఓ నాగేశప్ప

### గడప గడప సమస్య పరిష్కారం

కౌతాళం: మండలంలోని మరళి గ్రామంలో గడప గడప కార్యక్రమంలో భాగంగా పర్యటించి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దృష్టికి తెచ్చిన సమస్యలకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో పరిష్కారం చూపినట్లు సర్పంచ్ మల్లయ్య, నాయకులు వీరేష్, సోమశేఖర్ రెడ్డి, వెంకోబ, బసవ బుధవారం తెలిపారు. గ్రామంలో ఇటీవల జరిగిన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామం నుంచి ప్రధాన రోడ్డుపై ఉన్న స్థలాన్ని మహిళలు బహిర్భూమిగా వినియోగించుకోవడంతో గ్రామస్తులు ఆ రస్తా గుండా వెళ్లేందుకు ఇబ్బందులు పడే వారు. గ్రామస్తులు విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆ స్థలం చుట్టూ రూ. 50వేలతో బండలు పాతించారు.



జేసీబీతో పనులు చేయిస్తున్న దృశ్యం

## పంటల దిగుబడిపై రైతులకు అవగాహన

ఆదోనిరూరల్ : పంటల సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. డీఏఓ, పీఎల్ వరలక్ష్మి బుధవారం మండలంలోని కపటి గ్రామంలో వేరుశనగ పంటలో పొలంబడి కార్యక్రమం చేపట్టారు. పొలంబడి ప్రాముఖ్యతను వివరించారు. పొలాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. ఏడీఏ ఎం.గిరీష్, ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

### కరోనా సమయంలో బతికించారు..

2019 కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు అమోఘం. ప్రాణాలను సైతం లెక్కజేయకుండా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు అందజేయడం, కరోనా బాధితుల గుర్తింపు, క్వారంటైన్ కేంద్రాలకు తరలించడం, డిశ్చార్జ్ అయిన వారి ఆరోగ్యం గురించి వాకబు చేయడంలో వారు ఎంతో కీలకంగా వ్యహరించారు. పట్టణంలోని 29వ వార్డు బుడ్డేకల్ వీధిలో వలంటీర్ రేణుక కరోనా సోకిన మోతే లక్ష్మన్న ఇంటికి వెళ్లి పరీక్షలు చేయించి కరోనా పాజిటివ్ అని తేలడంతో అంబులెన్స్ పిలిపించి దగ్గరుండి కర్నూలులోని క్వారంటైన్ కేంద్రానికి పంపించి ప్రాణాలను కాపాడారు. వారం తర్వాత చికిత్స పొంది ఆరోగ్యంగా ఇంటికి చేరుకున్న లక్ష్మన్న.. వలంటీర్, ఏఎన్ఎం సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. నాడు వారి సేవలను స్థానికులు అభినందించారు. – ఆదోనిటౌన్



కరోనా సోకిన లక్ష్మన్నను అంబులెన్స్‌లో కర్నూలుకు తరలిస్తున్న వలంటీర్ రేణుక (ఫైల్ )

### కూతురిలా చూసుకుంది



కరోనా బారినపడి ఇంటి పట్టునే ఉంటున్న సమయంలో ప్రాణాలు దక్కవేమోనని బాధపడుతున్నా సమయంలో వలంటీర్ రేణుక కన్న కూతురిలా చూసుకుంది. ఆడబిడ్డ అయ్యుండి 108 వాహనం పిలిపించి తనను అందులో కర్నూలు పంపించింది. రోజూ ఫోన్ చేసి ఆరోగ్య వివరాలు తెలుసుకోవడమే కాకుండా ధైర్యంగా ఉండాలని సూచించింది. ఆమె ప్రాణాలకు తెగించి చేసిన చొరవతోనే నేను ఈ రోజు బతికి ఉన్నా. ప్రభుత్వం క్వారంటైన్ కేంద్రాల్లో బాగా చూసుకుంది. ఇంటికి వచ్చిన తరువాత కూడా చాలా రోజుల పాటు ఆరోగ్యం గురించి వాకబు చేయడమే కాకుండా వైద్యుల సూచనలతో వాడాల్సిన మందులను సూచించింది. – మోతె లక్ష్మన్న